
సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం । 30 । మే । 2025



ఉపాధ్యాయులకు బదిలీ కష్టాలు
ఉమ్మడి జిల్లాలో చేపట్టిన ఉపాధ్యాయ బదిలీల్లో ఎస్జీటీల బదిలీలపై స్పష్టత రాలేదు. వీరికి ఆఫ్‌లైన్‌లో బదిలీలు చేపట్టనున్నట్టు సమాచారం. 8లో ▸



ఆగడాలు భరించలేకే..
కుమారుడిని హతమార్చిన కేసులో పోలీసులు తండ్రిని అరెస్ట్ చేశారు. జంగారెడ్డిగూడెంలో డీఎస్పీ వివరాలను వెల్లడించారు. 8లో ▸



రైతుల అభివృద్ధికి కృషి
రైతుల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని వెంకట్రామన్నగూడెం ఉద్యాన వర్సిటీ వీసీ గోపాల్ తెలిపారు. 8లో ▸

గడపను వీడిన సేవలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలన పేదింటి తలుపు తట్టింది.. ఇంటికే పింఛన్, జగనన్న ఆరోగ్య సురక్ష, గడపగడపకూ మన ప్రభుత్వం, జగనన్న సురక్ష, ఫ్యామిలీ డాక్టర్.. ఇలా కార్యక్రమం ఏదైనా ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగాన్ని ప్రజల చెంతకు చేర్చింది. గతంలో కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా కాని పనులను ప్రజలు గడప దాటకుండానే చేసి చూపించింది. ఇదంతా గతం.. ప్రభుత్వం మారింది.. పాలన మారింది.. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిన ఏడాదిలోనే గడప చెంతకొచ్చే ఎన్నో సేవలకు మంగళం పాడింది.

నాడు సంక్షేమం..నేడు సంక్షామం

- పేదింటి తలుపు తట్టిన జగన్ ప్రభుత్వం
- ఇంటి వద్దకే పథకాలు, వైద్య సేవలు రేషన్ సరుకులు, సర్టిఫికెట్లు
- 'గడపగడపకు మన ప్రభుత్వం'తో సమస్యల పరిష్కారం
- ప్రజలకు ఈ సేవలను దూరం చేస్తున్న కూటమి ప్రభుత్వం
- వలంటీర్ వ్యవస్థ తొలగింపు
- పత్తాలేని 'ఫ్యామిలీ డాక్టర్'
- రేషన్ సరుకుల డోర్ డెలివరీ వ్యవస్థ రద్దు



ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దకే సరుకుల పంపిణీ (ఫైల్)



ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ఇంటికే వెళ్లి వైద్యం చేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలి చెంతకు వెళ్లి పింఛన్ అందిస్తున్న వలంటీర్ (ఫైల్)



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం (ఫైల్)

సాక్షి, భీమవరం: ఆరేళ్లకు పూర్వం ఏ పథకం అందాలన్న జన్మభూమి కమిటీలను ఆశ్రయించాల్సిందే. ఏ సర్టిఫికెట్ కావాలన్నా, ప్రభుత్వ పథకం పొందాలన్నా రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిందే. ఎమ్మెల్యేలు, మంత్రులను కలవడమంటే సామాన్యులకు గగనమయ్యేది. పింఛన్ల కోసం వృద్ధులు, దివ్యాంగుల అవస్థలు వర్ణనాతీతం. 2019లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనను కొత్త పుంతలు తొక్కించారు. జిల్లాలో 535 సచివాలయాలు, 8,616 మంది వలంటీర్లతో పాలనను ప్రజలకు చేరువ చేశారు. కులమత వర్గాలు, రాజకీయాలకు అతీతంగా, అవినీతి అక్రమాలకు తావులేకుండా పథకాల అమలులో ఈ వ్యవస్థలు పారదర్శకంగా పనిచేశాయి. ప్రతి నెలా ఇంటి వద్దకే పింఛన్లు అందించడంతో పాటు అనారోగ్యంతో ఇతర రాష్ట్రాల్లో చికిత్స పొందుతున్న లబ్ధిదారుల చెంతకు సైతం వెళ్లి ప్రభుత్వ సాయాన్ని అందజేసేవారు. రేషన్ సరుకుల కోసం కిలోమీటర్ల దూరం వెళ్లి దుకాణాల వద్ద పడిగాపులు పడాల్సిన పనిలేకుండా మొబైల్ (ఎండీయూ) వాహనాలను తెచ్చారు. జిల్లాలోని 356 రేషన్ వాహనాల ద్వారా 5,67,671 మంది కార్డుదారులకు ఇంటి వద్దకే వచ్చి సరుకులు అందించేవారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో చేరువ

ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని చేరువ చేశారు. జిల్లాలోని 20 మండలాల్లోని 41 పీహెచ్‌సీల పరిధిలోని 366 విలేజ్ హెల్త్ క్లినిక్ (వీహెచ్‌సీ)ల ద్వారా ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలు అందించారు. వైద్యులు ఇళ్ల వద్ద మంచానికే పరిమితమైన రోగుల చెంతకు సైతం వెళ్లి వైద్యసేవలు అందించేవారు.

'గడపగడపకూ'తో సత్వర పరిష్కారం

గతంలో ఎన్నడూ లేనివిధంగా మంత్రులు, ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకునేలా గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అమలుచేశారు. సమస్యల పరిష్కారం కోసం సచివాలయానికి రూ.20 లక్షలకు పైగా నిధులు మంజూరు చేశారు. జిల్లాలో రోడ్లు, డ్రెయిన్లు, తాగునీరు, విద్యుత్ తదితర రూ.83 కోట్ల విలువైన 1,836 పనులు గుర్తించి ఆయా సమస్యల పరిష్కారానికి గత ప్రభుత్వం కృషి చేసింది.

గతంలో సర్టిఫికెట్ల జారీ సులభతరం

ధ్రువీకరణ పత్రాల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలుచేశారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు జిల్లాలోని 6.45 లక్షల కుటుంబాలను సర్వే చేసి వారి అవసరాలను గుర్తించారు. 6,05,780 మంది లబ్ధిదారులకు ఎలాంటి సర్వీస్ చార్జ్ లేకుండా కొద్దిరోజుల వ్యవధిలోనే రికార్డు స్థాయిలో జనన, మరణ, ఆదాయ, కుల తదితర 6,48,807 సర్టిఫికెట్లు జారీ చేశారు.

ప్రజారోగ్యమే పరమావధిగా..

జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి ఇంటిని జల్లెడ పట్టి ఆరోగ్య సమస్యలున్న వారిని గుర్తించారు. 264 మంది స్పెషలిస్ట్ వైద్యులు, 182 మంది మెడికల్ ఆఫీసర్లు, ఇతర ఆరోగ్య సిబ్బందితో జిల్లావ్యాప్తంగా 447 వైద్య శిబిరాలను ఏర్పాటుచేశారు. 14 రకాల వైద్య పరీక్షలతో పాటు 172 రకాల మందులను అందుబాటులో ఉంచి 3.54 లక్షల మంది పేదలకు అవసరమైన వైద్య సాయం అందించారు.

కూటమి పాలనలో ఇంటింటికీ సేవలకు మంగళం

ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా పని చేసిన వలంటీర్ వ్యవస్థను కూటమి ప్రభుత్వం పక్కన పెట్టడం ద్వారా గడప చెంతకే సేవలకు మంగళం పాడింది. పింఛన్ల కోసం పేదలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇంటి వద్దకే రేషన్ సరుకుల పంపిణీని రద్దు చేసి మళ్లీ పాత పద్ధతిలో వచ్చే నెల నుంచి రేషన్ దుకాణాల వద్దకు వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితిని తెచ్చింది. పేదలకు వైద్య భరోసా కల్పించిన ఆరోగ్య సురక్ష శిబిరాల నిర్వహణను పక్కన పెట్టేసింది. మొన్నటివరకు తమ సమీప ఆరోగ్య కేంద్రంలో స్పెషలిస్ట్ వైద్యసేవల్ని ఉచితంగా పొందిన గ్రామీణ ప్రాంత ప్రజలు ఇప్పుడు వాటి కోసం వ్యయప్రయాసల కోర్చి పట్టణాలకు పరుగులు తీయాల్సి వస్తోంది. ఫ్యామిలీ డాక్టర్ పత్తాలేకుండా పోయారు. పేదలకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు చేసి కళ్లజోళ్లను అందజేసే ముఖ్యమంత్రి ఈఐ కేంద్రాలు సైతం మూతపడ్డాయి. ఏడాది పాలనలోనే ప్రభుత్వ సేవలు కోసం ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

ఇబ్బందులు పెరిగాయి



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నుంచి రేషన్ సరుకులు ఇంటి వద్దనే తీసుకుంటున్నాం. అయితే వచ్చేనెల నుంచి రేషన్ దుకాణాల చుట్టూ తిరగాల్సి రానుంది. ఇంట్లోని మగవారు పనిమానుకుని రేషన్ సరుకుల కోసం షాపులకు వెళ్లాల్సిందే. కూటమి ప్రభుత్వంలో పథకాలు మెరుగుపడతాయని అనుకుంటే ఇబ్బందులు పెరుగుతున్నాయి.
– కోరం లలిత, గంగడుపాలెం, యలమంచిలి మండలం

మా పొట్టకొట్టారు



ఎన్నికల సమయంలో కూటమి నాయకులు వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని, జీతం రూ.10 వేలు చేస్తామని హామీ ఇచ్చారు. తీరా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వలంటీర్ వ్యవస్థను రద్దు చేసి నాలాంటి నిరుద్యోగుల పొట్టకొట్టారు. మాకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపకుండా తొలగించేశారు. ఎన్నికల వాగ్దానాన్ని ప్రభుత్వం అమలుచేయాలి.
– రాంబాలపు పరమేష్, గ్రామ వలంటీర్, అత్తిలి

ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలి



గత నాలుగేళ్లుగా మొబైల్ వాహనంపై ప్రజలకు ఎంతో కష్టపడి ఇంటింటికీ వెళ్లి రేషన్ సరుకులు అందజేస్తున్నాం. దానిమీద బతికే వాళ్లం ఇప్పుడు హఠాత్తుగా మమ్మల్ని తొలగిస్తే మా కుటుంబాలు ఎలా బతకాలి. ఎండీయూ ఆపరేటర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను ప్రభుత్వం వెంటనే చూపాలి.
– యామల ఆంజనేయులు, ఎండీయూ ఆపరేటర్, శృంగవక్షం

న్యూస్‌రీల్

కొల్లేరులో అక్రమ తవ్వకాలు



చెరువు తవ్వుతున్న దృశ్యం

సాక్షి టాస్క్‌ఫోర్స్: కొల్లేరు అభయారణ్యంలో ఫారెస్ట్ అధికారుల కళ్లు కప్పి గుట్టుచప్పుడు కాకుండా అక్రమ చెరువుల తవ్వకానికి అక్రమార్కులు మరోసారి తెర తీశారు. గురువారం ఏలూరు రూరల్ మండలం మానూరు శివారు హరిపురంలో చెరువు గట్లు ఏర్పాటుచేశారు. కొల్లేరులో చెరువులు తవ్వటానికి అనుమతి లేదని తెలిసినా పనులు ప్రారంభించారు. విషయం తెలిసిన ఫారెస్ట్ అధికారులు ఇక్కడకు చేరుకుని గట్లను యంత్రాలతో ధ్వంసం చేశారు. అయితే గట్లు ఎవరూ వేశారన్నది తెలియదన్నారు. కొల్లేరులో జీఓ 120కు వ్యతిరేకంగా చెరువులు తవ్వితే సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

దెందులూరు: నిమ్మకాయలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం రామారావుగూడెంలో నిమ్మ తోటలను ఆయన పరిశీలించారు. నిమ్మ ధరలు తగ్గిపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ నిమ్మకాయల సీజన్‌లో ధరలు తగ్గడంతో రైతులు నష్టపోతున్నారన్నారు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఆస్పత్రిలో పనిచేయని ఫ్రీజర్

నూజివీడు: నూజివీడు ఏరియా ఆస్పత్రిలోని పోస్టుమార్టం గదిలో ఏడాదిగా ఫ్రీజర్ పనిచేయడం లేదు. దీంతో అద్దె ఫ్రీజర్‌ను ఏర్పాటుచేశారు. అయితే అద్దె రోజుకు రూ.5 వేలను మృతదేహానికి సంబంధించిన వారే చెల్లించాల్సి వస్తుంది. అసలే కుటుంబసభ్యులు బాధలో ఉండగా వారితో అద్దె కట్టించడం దారుణమని, పాడైపోయిన ఫ్రీజర్‌కు మరమ్మతులు చేయించడం లేదా కొత్త ఫ్రీజర్‌ను ఏర్పాటుచేయడం చేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

సహకార సంఘాలు రిటర్నులు దాఖలు చేయాలి



మాట్లాడుతున్న ఆదాయ పన్నుశాఖ జేసీ ప్రతాప్ సింగ్ బూక్యా

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సహకార సంఘాలు, సేవా సంఘాలు ఆదాయ పన్ను శాఖకు క్రమం తప్పకుండా రిటర్నులు దాఖలు చేయాలని ఆదాయ పన్నుశాఖ జాయింట్ కమిషనర్ ప్రతాప్ సింగ్ భూక్యా సూచించారు. గురువారం స్థానిక డీసీఎంఎస్ హాల్‌లో జిల్లా కో–ఆపరేటివ్ సొసైటీలు రిటర్నుల దాఖలుపై జిల్లా కో–ఆపరేటివ్ కార్యదర్శులు, పర్సన్ ఇన్చార్జిలతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదాయపన్ను శాఖ లాగిన్ ద్వారానే రిటర్నులు దాఖలు చేయాలన్నారు. జిల్లా సహకార శాఖ అధికారి ఆరిమిల్లి శ్రీనివాసు మాట్లాడుతూ జిల్లాలో సొసైటీలన్నీ ఆడిటర్‌ను సంప్రదించి రిటర్నులు దాఖలు చేయాలని సూచించారు. ఏలూరు ఆదాయ పన్ను శాఖ అధికారి షేక్ అబ్దుల్ ఖయాం, డివిజనల్ కో–ఆపరేటివ్ అధికారి పి.త్రినాథ్, ఆడిటర్ ఆర్.రాధాకృష్ణ పాల్గొన్నారు.

వెదురు సాగుకు సన్నాహాలు

బుట్టాయగూడెం: డ్వాక్రా సంఘాల మహిళల ద్వారా వెదురు సాగును ప్రోత్సహించి తద్వారా వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నట్టు మానవ వనరుల అభివృద్ధి పథకం జిల్లా అసిస్టెంట్ మేనేజర్ ఈ.వేణుగోపాల్ తెలిపారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో డ్వాక్రా సంఘాల వీఓఏలకు వెదురు సాగుపై శిక్షణ ఇచ్చారు. వేణుగోపాల్ మాట్లాడుతూ జిల్లాలోని బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాలను వెదురు సాగుకు పైలట్ ప్రాజెక్టులుగా ఎంపిక చేశామన్నారు. 500 గ్రామ సంఘాల సభ్యులను ఎంపిక చేసి ఒక్కొక్కరూ 35 సెంట్లలో వెదురు సాగు చేసేలా ప్రోత్సహిస్తున్నామన్నారు.

కుటుంబం ఆత్మహత్యాయత్నం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో ఓ కుటుంబం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాలిలా ఉన్నాయి.. పట్టణానికి చెందిన మంగిన సత్య దుర్గ చంద్రరరావు (చంద్రం), భార్య కృష్ణజ్యోతి, కుమారుడు దుర్గాచరణ్, కుమార్తె కోమలి గురువారం కూల్‌డ్రింక్‌లో కలుపు మందు కలిపి తాగారు. చుట్టుపక్కల వారు గమనించి స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసి వీరిని మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించారు. ఆర్థిక ఇబ్బందులు, అప్పులు కారణంగా తెలుస్తోంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నూరు శాతం క్షయ నివారణ లక్ష్యం

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో నూరు శాతం క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా పనిచేయాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి ఆదేశించారు. గురువారం కలెక్టర్ అధ్యక్షతన టీబీ ఫోరం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం కింద ఎవరైనా టీబీ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకుని 'నిక్షయ్ మిత్ర'గా రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిందిగా కోరారు. టీబీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం నిమిత్తం నెలకు రూ.600ల విలువైన పోషకాహారం అందజేయాల్సి ఉంటుందన్నారు. తాను కూడా నిక్షయ మిత్ర కింద 25 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు దత్తత తీసుకుని ఆహారాన్ని అందిస్తానని ప్రకటించారు. అనంతరం క్షయ వ్యాధి లక్షణాలపై రూపొందించిన వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. డీఎంహెచ్‌ఓ జి.గీతాబాయి, అడిషనల్ డీఎంహెచ్‌ఓ బి.భానునాయక్, డీసీహెచ్‌ఎస్ పి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగరాణి

ఎస్సీ, ఎస్టీ వర్గాల.. ఎస్సీ, ఎస్టీ వర్గాల ఆర్థిక పురోభివృద్ధికి, సంక్షేమానికి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ నాగరాణి తెలిపారు. కలెక్టర్ అధ్యక్షతన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలపై జరిగిన దాడులకు సంబంధించి నమోదైన కేసులపై విచారణ వేగవంతం చేయాలని, బాధితులకు సత్వర న్యాయం అందించాలన్నారు.

యోగాంధ్రకు ప్రణాళిక

భీమవరం: జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు భారీ ప్రణాళిక అమలు చేస్తున్నట్టు కలెక్టర్ నాగరాణి తెలిపారు. భీమవరం అల్లూరి సీతారామరాజు స్మృతివనంలో యోగా శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని యోగాసనాలు అభ్యసించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ యోగాంధ్రపై గ్రామ, మండల, జిల్లాస్థాయిలో విస్తృత అవగాహనా కార్యక్రమాలను నిర్వహించడానికి కమిటీలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, కార్మికులకు ఉపాధి కల్పించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని బ్రహ్మానందరెడ్డి మార్కెట్‌లోని ఉల్లిపాయల మార్కెట్ వర్కర్స్ తరఫున గురువారం విశాఖ ఉక్కు కార్మికులకు మద్దతుగా ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, బంకూరు నాగేశ్వరరావు, దూలం ప్రసాద్ మాట్లాడుతూ ప్రైవేటీకరణ ఆలోచనలను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని, రాష్ట్రంలో ఏకైక పెద్ద పరిశ్రమలో వేలాది మంది కార్మికుల ఉపాధిని దెబ్బ కొట్టడం దారుణమన్నారు. పరిశ్రమకు నిధులు కేటాయించాలని, తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, పరిశ్రమను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఉక్కు పరిశ్రమపై ఎటువంటి మాటలు మాట్లాడకపోవడం శోచనీయం అన్నారు. చల్లా చంద్రరావు, బర్ల బాలాజీ, బి.శివ తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా

సినిమా థియేటర్లలో తనిఖీలు

- బంద్ పిలుపే తనిఖీలకు కారణమంటున్న ఎగ్జిబిటర్లు
- ఏలూరు జిల్లాలో 42 థియేటర్లు
- నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేస్తున్న అధికారులు



ఏలూరు సత్యనారాయణ థియేటర్‌లో తనిఖీ చేస్తున్న తహసీల్దార్ శేషగిరి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు జిల్లావ్యాప్తంగా సినిమా థియేటర్లలో రెవెన్యూ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు థియేటర్లను పరిశీలిస్తున్నారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో థియేటర్లను గురువారం రెవెన్యూ అధికారులు తనిఖీ చేశారు. థియేటర్ల నిర్వహణ, ప్రజలకు సౌకర్యాల ఏర్పాటు, క్యాంటీన్లలో ధరలు తదితర అంశాలు, రికార్డులను పరిశీలించారు.

ఏలూరులో అంబికా థియేటర్, సాయి బాలాజీ థియేటర్, సత్యనారాయణ థియేటర్‌లలో తహసీల్దార్ జీవీ శేషగిరి తనిఖీ చేశారు. ఓ థియేటర్‌లోని క్యాంటిన్‌లో కూల్ డ్రింకులు, వాటర్ బాటిల్స్ అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు గుర్తించారు. జంగారెడ్డిగూడెంలో థియేటర్లను అక్కడి తహసీల్దార్ తనిఖీ చేశారు. కైకలూరులో విజయలక్ష్మి, వెంకటరమణ థియేటర్లను తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం, భీమడోలులో శ్రీనివాసా థియేటర్‌ను తహసీల్దార్ రమాదేవి తనిఖీ చేశారు.

బంద్ పిలుపు కారణంగానే..

ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా ఎగ్జిబిటర్లు నిర్మాతలతో సమావేశమై థియేటర్ల నిర్వహణపై పలు నిర్ణయాలు తీసుకున్న సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా థియేటర్లలో ప్రదర్శనలు అద్దె ప్రాతిపదికన కాకుండా సినిమాకు వచ్చే లాభాల ప్రాతిపదికన ఉండాలని కీలక నిర్ణయం తీసుకున్నారు. అలా లాభాల్లో వాటా ఇవ్వని పరిస్థితి వస్తే థియేటర్లను జూన్ 1 నుంచి మూసివేయడానికి నిర్ణయం తీసుకున్నారు. అలాగే కొత్త సినిమా రిలీజైన వెంటనే ఓటీటీల్లో రిలీజ్ చేయకుండా చూడాలని నిర్మాతల ముందుకు ప్రతిపాదనలు తీసుకువచ్చినట్టు తెలిసింది. అయితే ఆయా నిర్ణయాల వెనుక కుట్రకోణం ఉందని ఉప ముఖ్యమంత్రి భావించినట్లు వార్తలు కూడా వచ్చాయి. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో థియేటర్ల తనిఖీలకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినట్టు పలువురు ఎగ్జిబిటర్లు విమర్శిస్తున్నారు. ఇదంతా కేవలం కక్ష సాధింపు చర్యగానే పరిగణిస్తున్నామని పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ ప్రముఖ ఎగ్జిబిటర్ స్పష్టం చేశారు.

జిల్లాలో 42 థియేటర్లు

జిల్లాలో గతంలో 90 థియేటర్లు ఉండగా ప్రస్తుతం 42 థియేటర్లు నడుస్తున్నాయి. నియోజకవర్గాల వారీగా ఏలూరులో 15, చింతలపూడిలో 9, నూజివీడులో 5, ఉంగుటూరులో 6, కైకలూరులో 4, పోలవరంలో 3 థియేటర్లలో సినిమాలు ప్రదర్శిస్తున్నారు.

బంద్ విరమించారు



సినీ పరిశ్రమలో ఎగ్జిబిటర్ల పాత్ర ఎంతో కీలకం. ఇటీవల థియేటర్ల నిర్వహణ కష్టసాధ్యంగా మారింది. నిర్వహణ వ్యయం కూడా రాని పరిస్థితి. దీంతో ఎగ్జిబిటర్లు బంద్ నిర్ణయం తీసుకున్నారు. అయితే పరిశ్రమ పెద్దలు మధ్యవర్తిత్వంతో తెలుగు చిత్రసీమ ప్రయోజనాల కోసం వారు బంద్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు.
– అంబికా కృష్ణ, సినీ నిర్మాత, ఏలూరు

నిర్వహణ సంతృప్తికరం



ఏలూరులో థియేటర్లను క్షుణ్ణంగా తనిఖీ చేశాం. ఒకటి రెండు అంశాలు తప్ప అంతా సంతృప్తికరంగా ఉంది. కొన్ని థియేటర్లలోని క్యాంటిన్లలో అధిక ధరలకు కూల్‌డ్రింక్‌లు విక్రయించడాన్ని గుర్తించాం. దీనిపై నిర్వాహకులను హెచ్చరించాం. ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.
– జీవీ శేషగిరి, ఏలూరు తహసీల్దార్

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 42 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా ప్రాక్టికల్స్ గురువారం ఏలూరు జిల్లాలోని ఐదు కేంద్రాల్లో నిర్వహించారు. ఉదయం 52 మందికి 19 మంది, మధ్యాహ్నం 31 మందికి 23 మంది హాజరయ్యారని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.యోహాన్ ప్రకటనలో తెలిపారు.

ముగిసిన ఓపెన్ ఇంటర్ ప్రయోగ పరీక్షలు

ఏపీ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ ప్రయోగ పరీక్షలు ముగిశాయి. 16 మందికి 14 మంది హాజరయ్యారని డీఈఓ ఎం.వెంకట లక్ష్మమ్మ తెలిపారు.

అవగాహన సరే.. ఆచరణ ఏదీ ?



నగరపాలక సంస్థ అధికారులు లక్షలు ఖర్చు పెట్టి గోడలపై 'స్వచ్ఛభారత్ వైపు అడుగు వేద్దాం.. స్వచ్ఛ ఏలూరును తీర్చిదిద్దుదాం' అంటూ స్లోగన్స్, చిత్రాలతో తీర్చిదిద్దారు. అయితే ఆచరణ మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. ఏలూరు ప్రభుత్వాస్పత్రి దగ్గర నుంచి విజయవిహార్ సెంటర్ వరకు ఇరువైపులా డ్రైనేజీ మూసుకుపోయి వర్షం నీరు ఇలా ఫుట్‌పాత్‌ను ఆనుకుని మురుగునీరులా మారి దుర్గంధం వెదజల్లుతోంది. అక్కడే గోడలపై స్వచ్ఛభారత్ స్లోగన్స్ ఉన్నాయి. వీటిని చూసిన వారు అవగాహన సరే.. ఆచరణ ఏదీ అంటూ ప్రశ్నిస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు

క్లుప్తంగా

ట్రిపుల్ ఐటీలో రెండోరోజు సర్టిఫికెట్ల పరిశీలన



నూజివీడు ట్రిపుల్ ఐటీలో సర్టిఫికెట్ల పరిశీలన చేస్తున్న అధికారులు

నూజివీడు: స్థానిక ట్రిపుల్ ఐటీలో రెండోరోజు గురువారం ప్రత్యేక కేటగిరి అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించారు. దీనిలో భాగంగా సైనికోద్యోగుల పిల్లల కోటా, ఎన్‌సీసీ, క్రీడా, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటాకు చెందిన అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. క్రీడా కోటాకు సంబంధించి 245 మందికి 171 మంది, సైనికోద్యోగుల పిల్లల కోటాకు సంబంధించి 117 మందికి 79 మంది, ఎన్‌సీసీ కేటగిరికి సంబంధించి 341 మందికి 277 మంది, భారత్ స్కౌట్స్ గైడ్స్ కేటగిరికి సంబంధించి 247 మందికి 185 మంది హాజరయ్యారు. ఈనెల 30న ఎన్‌సీసీ, క్రీడా కోటా అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించనున్నారు. సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమాన్ని డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్, ప్రొఫెసర్ ఆచార్య ఎస్ఎస్ఎస్‌వీ గోపాలరాజు పర్యవేక్షించారు.

భారత సైన్యం సత్తాకు ప్రతీక సిందూర్



నిట్‌లో తిరంగా యాత్రలో పాల్గొన్న ఇన్‌చార్జి డైరెక్టర్ రమణరావు

తాడేపల్లిగూడెం: దేశ రక్షణలో సైనికుల పాత్ర అమూల్యమని ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎన్‌వీ రమణరావు అన్నారు. ఏపీ నిట్‌లో గురువారం జరిగిన తిరంగా యాత్రలో ఆయన మాట్లాడారు. భారత సైన్యం ధైర్య సాహసాలకు, త్యాగనిరతికి ఆపరేషన్ సిందూర్ ప్రతీక అని అన్నారు. ఈ విజయం భారత జవాన్ల సత్తాను ప్రపంచానికి చాటి చెప్పిందన్నారు. మాతృభూమి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ప్రతి సైనికుడి జీవితం స్ఫూర్తిదాయకమని, విద్యార్థులు వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కన్నవాళ్లకు, కుటుంబాలకు దూరంగా దేశ సరిహద్దుల్లో రాత్రి పగలూ విధులు నిర్వర్తిస్తూ శత్రు సైన్యాన్ని చీల్చి చెండాడుతున్న సైనికుల పోరాటపటిమకు సెల్యూట్ కొట్టాలన్నారు. దేశభక్తిని చాటే నినాదాలతో త్రివర్ణ పతాకాలతో విద్యార్థులతో కలిసి ఆయన ర్యాలీలో పాల్గొన్నారు. రిజిస్ట్రార్ దినేష్ రెడ్డి, నిట్ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు బదిలీ కష్టాలు

- ఎస్జీటీల బదిలీలపై స్పష్టత కరువు!
- ఆఫ్‌లైన్‌లో చేపడతామని అధికారుల హామీ
- నేటి వరకూ ఉత్తర్వులివ్వని పాఠశాల విద్యాశాఖ
- ఆన్‌లైన్‌లో తప్పులు దొర్లుతాయని గురువుల ఆందోళన
- ఉమ్మడి జిల్లాలో బదిలీల జాబితాలో 2,861 ఎస్జీటీలు



కొమ్మర స్కూల్లో విద్యార్థులకు బోధిస్తున్న ఎస్జీటీ రమేష్

నిడమర్రు : ఉపాధ్యాయ బదిలీలు ఈనెల 22వ తేదీ నుంచి విద్యాశాఖ ప్రారంభించింది. నేటి వరకూ ఈ ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్ వేదికగా కొనసాగుతోంది. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల బదిలీలు పూర్తయింది. నియామక ఉత్తర్వులు కూడా జారీ చేశారు. మిగిలిన 94 ఖాళీలకు గురువారం ఏలూరు డీఈఓ కార్యాలయంలో అర్హతగల ఎస్ఏలకు పదోన్నతులు కల్పించి గ్రేడ్-2 హెచ్ఎంలుగా మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించి భర్తీ చేశారు. తర్వాత పీఎస్ హెచ్ఎంలకు, స్కూల్ అసిస్టెంట్, పండింట్‌లకు ఆన్‌లైన్‌లోనే బదిలీల ప్రక్రియ నిర్వహించేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. కానీ ఎస్జీటీల బదిలీల విషయంలో ఇంకా స్పష్టత రాలేదు. ఎస్జీటీలకు ఆఫ్‌లైన్‌లో బదిలీలు చేపడతామని పాఠశాల విద్య ఉన్నత అధికారులు ఉపాధ్యాయ సంఘాల నేతల చర్చల సమయంలో అంగీకారం తెలిపారు. దీంతో ఎస్జీటీలకు కొంత సౌలభ్యం లభించిందని అందరూ భావించారు. కానీ ప్రభుత్వం విడుదల చేస్తున్న జీవోల్లో మాత్రం అన్ని వర్గాల ఉపాధ్యాయులతోపాటు ఎస్జీటీలకు ఆన్‌లైన్‌లో బదిలీలు పూర్తయ్యేలా మార్గదర్శకాలు జారీ చేశారు. షెడ్యూల్ ప్రకారం జూన్ 7 నుంచి 10 వరకూ ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్స్ ఇవ్వాలని 11వ తేదీన నూతన పాఠశాలల బదిలీ ఆర్డర్స్ విడుదల వుతాయంటూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో ఎస్జీటీలు గందరగోళంలో పడ్డారు. ఉన్నత అధికారుల హామీ ప్రకారం మాన్యువల్ బదిలీలే చేపట్టాలని ఎస్జీటీలు పట్టుపడుతున్నారు. కానీ అధికారులు మాన్యువల్ బదిలీల వల్ల అనేక సమస్యలు వస్తాయని ఆన్‌లైన్ బదిలీలే పరిష్కారం అంటూ పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. మొత్తం మీద ఈ విషయంపై ప్రభుత్వం ఏవిధమైన జీవో ఇంత వరకూ ఇవ్వలేదని సంఘాలు చెబుతున్నాయి.

పోస్టుల ఖాళీల స్పష్టతకే ఆఫ్‌లైన్

జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో జరిగే ఆఫ్‌లైన్ బదిలీల ప్రక్రియ అందరికీ సౌకర్యవంతంగా ఉంటుందని ఎస్జీటీలు అభిప్రాయపడుతున్నారు. అక్కడే ఉపాధ్యాయుడికి వచ్చిన పాయింట్ల ఆధారంగా మండలాల్లోని పాఠశాలలు ప్రదర్శిస్తారు. అక్కడ పాఠశాల వివరాలు తెలుసుకుని ఐచ్ఛికాలు ఎంపిక చేసుకుంటే. ఎక్కడికి బదిలీ అవుతుందనేది స్పష్టంగా తెలిసిపోతుంది. దీంతో అప్పటికే పోస్టులు క్లోజ్ అయిన పాఠశాలల వివరాలు ప్రదర్శిస్తుండటంతో మారాల్సిన పాఠశాలలను ఎంపిక చేసుకునే వీలుంటుంది. దీంతో ఐచ్ఛికాల ఎంపిక సంఖ్య కూడా చాలా వరకూ తగ్గిపోతుంది. తప్పులు చేసే అవకాశం ఉండదని సంఘాలు ముందు నుంచి అధికారులకు చెబుతున్నారు.

మాన్యువల్ చేపడితే ఇబ్బందులు ఇలా..

తాజా బదిలీల్లో జిల్లాలో 2,861 మంది ఎస్జీటీలు బదిలీల జాబితాలో ఉన్నారు. వీరంతా ఐచ్ఛికాలు (ఆప్షన్స్) ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. అయితే ఆన్‌లైన్ విధానంలో ఐచ్ఛికాలు ఎంపిక చేసుకోవడం కష్టతరంగా ఉంటుందని వీరు చెబుతున్నారు. ముఖ్యంగా మహిళా టీచర్లు, సీనియర్ టీచర్లు ఆన్‌లైన్ విధానం అలవాటు లేకపోవడం, కంప్యూటర్ పరిజ్ఞానం లేకపోవడం వల్ల ఆప్షన్స్ ఎంపిక చేసుకునే క్రమంలో తప్పులు నమోదు చేస్తే దూరంగా పోస్టింగ్ వస్తుందని ఆందోళన వ్యక్త చేస్తున్నారు. దీంతోపాటు ఆన్‌లైన్ విధానంలో వందల సంఖ్యలో ఆప్షన్లు ఎంపిక చేసుకోవాల్సి వస్తుందని ఈ విధానం వల్ల కనీసం ఆయా మండలాల్లోని పాఠశాల స్థితిగతులు కూడా తెలియవని అంటున్నారు.

ఆఫ్‌లైన్ బదిలీలపై ఉత్తర్వులు ఇవ్వాలి



ఉపాధ్యాయ సంఘాల నేతల చర్చల్లో విద్యాశాఖ ఉన్నత అధికారులు ఎస్జీటీలకు మాన్యువల్ బదిలీలు చేపడతామని హామీ ఇచ్చారు. కానీ ఉపాధ్యాయుల బదిలీల మార్గదర్శకాల ఉత్తర్వుల్లో ఎస్జీటీలంతా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు, వెబ్ ఆప్షన్స్, జాయినింగ్ ఆర్డర్స్ అంటూ ఉత్తర్వులు ఇవ్వడం తగదు. వెంటనే జిల్లా కేంద్రాల్లో మాన్యువల్ బదిలీలకు ఉత్వరులు ఇవ్వాలి.

– సీహెచ్ శ్రీధర్, యూటీఎఫ్ అధ్యక్షుడు, ఉంగుటూరు

ఆన్‌లైన్ వల్ల నష్టపోతున్నాం



ఉంగుటూరు మండలం తల్లాపురం యూపీ స్కూల్లో ఎస్జీటీగా విధులు నిర్వహిస్తూ 2023 చేపట్టిన ఆన్‌లైన్ బదిలీల్లో కుక్కునూరు మండలం కమ్మరిగుడెం ప్రాథమిక పాఠశాలకు వెళ్లాల్సి వచ్చింది. వెబ్ ఆప్షన్స్ ఇచ్చే వరుస క్రమంలో దొర్లిన పొరపాటు కారణంగా అంత దూరం వెళ్లాల్సిన పరిస్థితి. ఆన్‌లైన్ బదిలీల వల్ల అనేక మంది ఎస్జీటీలు నష్టపోతున్నారు.

– కె. కమల్‌కుమార్, ఎస్జీటీ, ఉంగుటూరు

అధికారుల నుంచి స్పష్టత రావాలి



ఉన్నత అధికారులు జారీ చేసిన బదిలీల ఉత్తర్వుల్లో జూన్ 7 నుంచి 10వ తేదీ వరకూ ఎస్జీటీలు ఆన్‌లైన్‌లోనే వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకోవాల్సి ఉంది. ఇప్పటి వరకూ అన్ని కేటగిరి బదిలీలు, వెబ్ ఆప్షన్స్, ఆర్డర్స్ అన్నీ ఆన్‌లైన్‌లో పారదర్శకంగా జరుగుతున్నాయి. ఎస్జీటీలకు మాన్యువల్ ట్రాన్స్‌ఫర్ విషయంపై ఇప్పటి వరకూ ఎటువంటి అధికారిక సమాచారం లేదు.

– ఏపీఎస్ఎస్ భాస్కరకుమార్, ఎంఈవో, నిడమర్రు

ఆగడాలు భరించలేకే హతమార్చా

కొడుకును చంపిన కేసులో తండ్రి వెల్లడి



పట్టుకున్న నిందితుడితో సీఐ వి.కృష్ణబాబు తదితరులు

జంగారెడ్డిగూడెం: కుమారుడిని హత్యచేసిన కేసులో తండ్రిని అరెస్టు చేశారు. గురువారం జంగారెడ్డిగూడెం సర్కిల్ కార్యాలయంలో డీఎస్పీ యు.రవిచంద్ర వివరాలు వెల్లడించారు. సీతంపేటకు చెందిన కొప్పుల నాగేశ్వరరావు చికెన్‌షాపు నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతనికి ఇద్దరు కుమారులు కాగా, మృతుడు పవన్‌కుమార్ (24) పెద్ద కుమారుడు. డిగ్రీ చదువు మధ్యలో మానివేసి చెడు వ్యసనాలకు అలవాటు పడ్డాడు. ప్రతిరోజు తాగి వచ్చి ఆస్తి ఇవ్వాలంటూ తండ్రి, కుటుంబసభ్యులతో గొడవ పడుతూ, 9 నెలల క్రితం హైదరాబాద్ వెళ్లిపోయాడు. మరలా తిరిగి వచ్చి డబ్బులు కావాలని, లేకపోతే తన ఆస్తి తనకివ్వాలని గొడవ పడేవాడు. ఈ క్రమంలో పవన్‌కుమార్ తండ్రి నాగేశ్వరరావుపై దాడి చేశాడు. దీంతో విసిగిపోయిన నాగేశ్వరరావు ఈ నెల 26న వీరన్నగుడెం గ్రామంలోని నరసయ్య చెరువు గట్టుపై తన స్నేహితుడుకి చెందిన తాటాకింటికి పవన్‌కుమార్‌ను తీసుకువెళ్లి మద్యం పట్టించి మత్తులో గొంతు కోసి హత్య చేసి పారిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడిని అరెస్టు చేసిన సీఐ వి.కృష్ణబాబును, ఎస్సై షేక్ జబీర్‌ను, ఏఎస్సై ఎన్‌వీ సందప్ కుమార్, పీసీలు రమేష్, దిలీప్‌లను డీఎస్పీ అభినందించారు. రివార్డు కోసం ఎస్పీకి సిఫార్సు చేయనున్నట్లు తెలిపారు.

ఆకివీడులో ఒంటెల సందడి



ఎడారి ప్రాంతంలో తిరిగే ఒంటెలు ఆకివీడులో సందడి చేశాయి. అలహాబాద్‌కు చెందిన కుటుంబాలు మూడు ఒంటెలను ఇక్కడకు తీసుకువచ్చి స్థానిక ప్రధాన రహదారి, ఇతర ప్రాంతాల్లో తిప్పుతున్నారు. వాటిపై పిల్లల్ని ఎక్కించి వచ్చిన ఆదాయంతో జీవనోపాధి పొందుతున్నారు. గురువారం సాయంత్రం మార్కెట్ రోడ్డులో తిరుగుతున్న ఒంటెల్ని చూసి చిన్నారులు కేరింతలు కొట్టారు.

– ఆకివీడు

రైతుల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి

ఉద్యాన వర్సిటీ ఉప కులపతి డాక్టర్ గోపాల్



పట్టింపాలెంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ యాత్రను ప్రారంభిస్తున్న ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి గోపాల్

తాడేపల్లిగూడెం రూరల్ : రైతుల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ కే.గోపాల్ అన్నారు. గురువారం మండలంలోని పట్టింపాలెం గ్రామంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ గోపాల్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని 11 క్లస్టర్లుగా విభజించి రైతులు ఏ పంట వేస్తే మేలు చేకూరుతుందనే దానిపై కృషి జరగాలన్నారు. రైతులకు మేలైన వరి వంగడాలను అందించాలని, సాగులో పురుగు మందుల వినియోగాన్ని తగ్గించి, లాభసాటిగా మార్చాలన్నారు. ఆరోగ్యకరమైన పంటలను పండించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ ప్రాంతంలో కోకో ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. స్థానిక రైతాంగానికి ఏ పంటలు అనుకూలమో శాస్త్రవేత్తలు సూచించాలన్నారు. ఐసీఏఆర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జేవీ.ప్రసాద్ మాట్లాడుతూ సాగులో నూతన పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఐసీఏఆర్ డైరెక్టర్ డాక్టర్ ఎం. శేషు మాధవ్, భారతీయ ఆయిల్‌పామ్ పరిశోధన సంస్థ (పెదవేగి) డైరెక్టర్ డాక్టర్ కే.సురేష్, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ కేటీవీ.రమణ మాట్లాడారు. జిల్లా వ్యవసాయాధికారి జడ్ వెంకటేశ్వరరావు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి కే.దేవానంద్, ఉద్యాన విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ బి.గోవిందరాజులు, ఏడీఏ మురళీకృష్ణ, పశు, మత్స్యశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. శివ కల్యాణం



శివదేవుని కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

ద్వారకాతిరుమల : క్షేత్రపాలకునిగా విరాజిల్లుతున్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయంలో గురువారం శివదేవుని కల్యాణ మహోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని అట్టహాసంగా నిర్వహించిన ఈ వేడుక భక్తులకు కనువిందు చేసింది. మండపంలో ఏర్పాటు చేసిన వేదికపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఉంచి, అర్చకులు విశేష పుష్పాలంకారాలు చేశారు. ఆ తరువాత కల్యాణ తంతును ప్రారంభించి, సుముహూర్త సమయంలో నూతన వధూవరుల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ధరింపజేశారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణలు, భక్తుల శివనామస్మరణల నడుమ మాంగల్యధారణ, తలంబ్రాల వేడుకలను కన్నులపండువగా జరిపి, కల్యాణ మూర్తులకు హారతులిచ్చారు. ఈ వేడుకలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

జేఈఈ మెయిన్స్‌కు ఉచిత దీర్ఘకాలిక శిక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : జేఈఈ మెయిన్స్‌లో అర్హత మార్కులు సాధించి సీట్లు సాధించలేకపోయిన పేద కుటుంబాల విద్యార్థులకు ఉచితంగా దీర్ఘకాలిక శిక్షణ ఇప్పించాలని నిర్ణయించినట్టు స్పృహ ఎడ్యుకేషనల్ ఎంపవర్‌మెంట్ ట్రస్ట్ తెలిపింది. ఈ మేరకు ట్రస్ట్ ప్రతినిధులు అంగులూరు సర్వేశ్వరరావు, టీటీఎఫ్ రూజ్‌వెల్ట్ ఏలూరులో గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కుటుంబ వార్షికాదాయం రూ.1.20 లక్షల లోపు ఉండి అత్యుత్తమ మార్కులు సాధిస్తున్న విద్యార్థులను ప్రోత్సహించడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్టు వారు ఆ ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి జూన్ 21న స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తున్నామని, అందులో ప్రతిభ చూపిన సుమారు 10 మంది విద్యార్థులకు ఉచిత శిక్షణ అందించే ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 79816 96481, 93900 59900, 99595 07507 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ద్వారకాతిరుమలలో వర్షంతో ఇక్కట్లు



ద్వారకాతిరుమల టీటీడీ కాంప్లెక్స్ వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

ద్వారకాతిరుమల: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ప్రజలను ఇక్కట్లకు గురి చేస్తున్నాయి. ద్వారకాతిరుమలలో గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి తూర్పువీధిలోని డ్రెయినేజీలు పొంగిపొర్లడంతో రోడ్డుపైకి మురుగు నీరు, చెత్తాచెదారం చేరింది. కాలినడకన రాకపోకలు సాగించిన స్థానికులు, భక్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. అలాగే టీటీడీ కాంప్లెక్స్ వద్ద ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిలిచిపోయింది. గ్రామంలోని పలు ప్రాంతాలు నీట మునిగాయి.

గోదావరిలో గల్లంతైన మృతదేహం లభ్యం

యలమంచిలి: చించినాడ వశిష్ఠ గోదావరి వంతెన మీద నుంచి బుధవారం గోదావరిలోకి దూకి గల్లంతైన యువకుడి మృతదేహం గురువారం లభ్యమైనట్లు ఎస్సై కె గుర్రయ్య తెలిపారు. వంతెనపై దొరికిన బైక్, సెల్ ఫోన్ ఆధారంగా అతను భీమవరం మండలం తాడేరు గ్రామానికి చెందిన షేక్ కాసు (24)గా గుర్తించిన స్థానికులు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. చించినాడ వచ్చిన తల్లిదండ్రులు బైక్, సెల్‌ఫోన్ తమ కుమారుడివేనని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు గోదావరిలో గాలించగా గురువారం మృతదేహం లభ్యమైంది. శవ పంచనామా చేసి, పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం చేసిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై వివరించారు.

నీకు భారం కాలేను.. పిల్లల్ని జాగ్రత్తగా చూసుకో..

భర్తకు మెసెజ్ పెట్టి గోదావరిలో దూకి వివాహిత ఆత్మహత్య



సుంకరం కల్యాణి (ఫైల్)

ఏలూరు టౌన్: అన్నింటికీ నీపై ఆధారపడుతున్నాను.. ఇక నీకు భారం కాలేను.. పిల్లల్ని జాగ్రత్తగా చూస్కోండి అంటూ భర్తకు ఫోన్‌లో మెసెజ్ పెట్టి ఓ వివాహిత గోదావరిలోకి దూకి తనువు చాలించింది. వివరాలు ఇలా ఉన్నాయి. రాజమండ్రి లాలా చెరువు స్పిన్నింగ్ మిల్లు ప్రాంతానికి చెందిన సుంకరం రామకృష్ణ, కళ్యాణి (32) దంపతులు. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. ఏలూరు శాంతినగర్ 21 వ డివిజన్ సచివాలయంలో కళ్యాణి ఏఎన్ఎంగా పనిచేస్తుండడంతో ఆమె కుటుంబంతో స్థానికంగానే నివాసముంటున్నారు. రెండేళ్ల క్రితం ఆమెకు ఒక రోడ్డు ప్రమాదంలో కాలికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆమె సరిగా నడవలేని పరిస్థితిలో భర్తపై ఆధారపడి జీవనం సాగిస్తోంది. ఆమె చేస్తున్న ఉద్యోగంలో, కుటుంబ జీవనంలోనూ భర్తపై ఆధారపడుతోంది. ఒకవైపు కరోనా వ్యాప్తి చెందుతుందనే భయం, మరోవైపు పని భారం పెరగడంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురైన ఆమె బుధవారం ఎవరికీ చెప్పకుండా రాజమండ్రి వెళ్లింది. భర్త రామకృష్ణకు ఫోన్‌లో.. ప్రతి పనికి నీ మీద ఆధార పడి ఉంటున్నా.. నిన్ను ఇబ్బంది పెడుతున్నాను.. నాకు జీవితంపై విరక్తి కలిగింది.. పిల్లల్ని జాగ్రత్తగా చూసుకో అని మెసేజ్ పెట్టింది. దీంతో ఏలూరు త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా సెల్‌ఫోన్ సిగ్నల్ ట్రేస్ చేశారు. లొకేషన్ రాజమండ్రిలో చూపించగా అక్కడకు వెళ్లి వెదికారు. తీరా చూస్తే ఆమె గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై రాజమండ్రి త్రీ టౌన్ సీఐ వీ అప్పారావు ఆధ్వర్యంలో మృతదేహాన్ని రాజమండ్రి సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. రాజమండ్రి త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రజకుల చెరువులను సర్వే చేసి హద్దులు నిర్ణయించాలి



చెరువుల ఆక్రమణలు తొలగించాలని కోరుతున్న కట్లయ్య, రజకులు

జంగారెడ్డిగూడెం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అనేక మండలాల్లో రజకుల చెరువులు ఆక్రమణలకు గురయ్యాయని, దీంతో రజక వృత్తికి ఆటంకం ఏర్పడుతుందని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజకజన సంఘ అధ్యక్షుడు, రాష్ట్ర రజక సంఘ ప్రధాన కార్యదర్శి చిలకలపల్లి కట్లయ్య ఆవేదన వ్యక్తం చేశారు. రజక చెరువుల ఆక్రమణలకు అడ్డుకట్ట పడాలంటే చెరువులను సర్వేయర్లతో సర్వే చేయించి హద్దులు నిర్ణయించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. గురువారం జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం మండలాల్లో ఆక్రమణలకు గురైన చెరువులను రజక సంఘాలతో కలిసి పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. జంగారెడ్డిగూడెం మండలం లక్కవరంలో రజకులకు సుమారు 50 ఏళ్ల క్రితం కేటాయించిన 3.11 ఎకరాల కోనేరు చెరువు ఆక్రమణలకు గురవ్వడంతో రజక వృత్తి చేసుకునేందుకు రజకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై గ్రామ కార్యదర్శి నాగేశ్వరరావుతో మాట్లాడగా చెరువుని రజకులకు ఉపయోగపడే విధంగా చేస్తామని తెలిపారన్నారు. అలాగే చెరువులో సరిగా నీరు లేనందున లీజు రూ. 11వేలు రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా రజక సంఘ మహిళా అధ్యక్షురాలు మెట్ట లక్ష్మీ ప్రసన్న, గ్రామ రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు



కాళ్ళకూరులో కాలువలోకి దూసుకెళ్లిన కారు

కాళ్ల: అతివేగంతో వెళ్తున్న కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి కాలువలోకి దూసుకెళ్లిన ఘటన కాళ్ల మండలం కాళ్ళకూరు గ్రామంలో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జువ్వలపాలెం వైపు నుంచి వస్తున్న కారు అదుపుతప్పి సచివాలయం ఎదుట విద్యుత్ స్తంభాన్ని కొట్టి కాలువలోకి వెళ్లింది. కారు వేగం ధాటికి విద్యుత్ స్తంభం ముక్కలైంది. విద్యుత్ తీగలు ఆధారంతో స్తంభం నిలిచిందని, ప్రమాద సమయంలో కారులో చిన్నపిల్లలు కూడా ఉన్నారని స్థానికులు తెలిపారు. కారుకి బెలూన్ ఓపెన్ కావడంతో ప్రాణనష్టం జరగలేదు. చిన్న చిన్న దెబ్బలతో బయటపడిన వారిని స్థానికులు భీమవరం హాస్పిటల్‌కి తరలించారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి



వృద్ధురాలి మృతదేహం

భీమవరం: భీమవరం ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్సకు వచ్చిన వృద్ధురాలు అకస్మాత్తుగా ప్రాణాలు విడిచిన ఘటన ఇది. గుండె నొప్పితో ఎస్.జయలక్ష్మి (70) పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఈ నెల 25న చేరినట్లు ఉన్న కాగితంతో ప్రాంతీయ ఆసుపత్రికి బుధవారం రాత్రి 9 గంటల సమయంలో వచ్చింది. చికిత్స అందించేలోపు శ్వాస విడిచినట్లు వైద్యులు తెలిపారు. చిరునామా, ఇతర వివరాలు చెప్పకుండానే ఆమె మృతి చెందింది. వృద్ధురాలి వివరాలు తెలిసిన వారు ఆసుపత్రి అధికారులకుగాని, పోలీసులకు గాని వివరాలు తెలియజేయాలని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

దాడి చేసిన వ్యక్తి అరెస్టు

భీమవరం: డబ్బులు ఇస్తేనే సోడా ఇస్తానన్న దుకాణ యజమానిపై దాడి చేసిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన బబ్లూ యాదవ్‌ను గురువారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం.. చినరంగనిపాలెం ప్రాంతంలో సోడా కొట్టు నిర్వహిస్తున్న ఎస్.వీరవెంకట సత్యనారాయణ దగ్గరకు బేతనీపేటలో ఉంటున్న బబ్లూయాదవ్ ఈ నెల 26న వెళ్లి సోడా అడిగాడు. డబ్బులు ఇస్తేనే సోడా ఇస్తానని చెప్పగానే అతనిపై నిందితుడు దాడికి దిగాడు. అంతేకాక అతని వద్ద ఉన్న రూ. 2 వేలు లాక్కెళ్లిపోయాడు. సత్యనారాయణ పోలీసులను ఆశ్రయించగా నిందితుడిని అరెస్ట్ చేశారు. ఎస్సై ఎస్‌వీవీఎస్ కృష్ణాజీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



తణుకులో వసతి గృహంలో మలాథియన్ స్ప్రే చేయిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: తణుకు మునిసిపాలిటీ పరిధిలోని 11 వసతి గృహాల్లో మలాథియాన్ ఫోకల్ రెసిడ్యూవల్ స్ప్రేయింగ్ చేయించినట్లు సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు తెలిపారు. కీటక జనిత వ్యాధుల నివారణలో భాగంగా ఉన్నతాధికారుల సూచనల మేరకు ఈ స్ప్రేయింగ్ చేయించినట్లు చెప్పారు. అనంతరం వసతి గృహాల్లో పరిశుభ్రత విషయంలో సిబ్బందికి పలు మార్గదర్శక సూచనలు చేశామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఫైలేరియా కంట్రోల్ యూనిట్ సూపర్‌వైజర్ కె. సత్యనారాయణ, వసతి గృహాల పరిధిలోని పట్టణ ఆరోగ్య కార్యదర్శులు, ఆశ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో మేనేజర్ వైఎస్ఎన్ మూర్తికి అభినందనలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీఎస్ ఆర్టీసీ తాడేపల్లిగూడెం డిపో మేనేజర్‌గా పనిచేసిన యేలూరి సత్యనారాయణ మూర్తి పదోన్నతి పొందారు. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రికి డీపీటీటీగా వెళ్లారు. ఆర్టీసీ డిపో ఉద్యోగులు, కార్మికులు, సిబ్బంది అభినందనలు చెప్పారు. ప్రస్తుతం తణుకు డీఎం గిరిధర కుమార్ తాడేపల్లిగూడెం డిపోకు ఇంచార్జిగా వ్యవహరిస్తున్నారు.

సినీ సంగీత విభావరిని విజయవంతం చేయండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): సూపర్‌స్టార్ డాక్టర్ ఘటమనేని కృష్ణ 82వ జయంతి సందర్భంగా ఈ నెల 31వ తేదీ శనివారం సాయంత్రం 6 గంటల నుంచి సినీ అనుకరణ నృత్యాలు, సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు విజయవంతం చేయాలని కృష్ణ, మహేష్‌బాబు ఫాన్స్ కోరారు. సభా కార్యక్రమం, సన్మానాలు ఉంటాయని వెల్లడించారు.

దివ్యాంగుల పిల్లలను బడిలో చేర్పించండి



ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): బడి బయట ఉన్న, బడి వయస్సు దివ్యాంగుల పిల్లలను బడిలో చేర్పించాలని, సంక్షేమ పథకాలు వారికి చేరువ చేయాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్స్ దుర్గ భవాని, విశాలాక్షిలు పేర్కొన్నారు. దివ్యాంగుల పిల్లల ఎన్రోల్మెంట్ కార్యక్రమం గురువారం పట్టణంలో జరిగింది. భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్కే బాల ఈశ్వరయ్య, ఎం.చంద్రకుమారి, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని నార్త్‌లో 33/11కేవీ హౌసింగ్‌బోర్డు సబ్ స్టేషన్ కాలనీ పరిధిలో గణేష్‌నగర్ ఫీడర్‌కు సంబంధించి ఈ నెల 30వ తేదీ శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ కె.నరసింహమూర్తి వెల్లడించారు. వన్ టౌన్‌లోని గాంధీ బొమ్మ సెంటర్, ఏరియా ఆసుపత్రి, గణేష్ నగర్, కొండాలమ్మ గుడి, మిలిటరీ కాలనీ, గవర్నమెంట్ పాలిటెక్నిక్ ఏరియాలలో విద్యుత్ లైన్‌లు మరమ్మతులు నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పట్టణ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పట్టణంలోని సౌత్‌లో....

సౌత్‌లోని తాడేపల్లిగూడెం టౌన్ ఫీడర్‌కు సంబంధించి విద్యుత్ మరమ్మతులు నిమిత్తం జువ్వలపాలెం నుంచి సవిత్యపేట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ డివిజన్ ఈఈ కె.నరసింహమూర్తి వెల్లడించారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ ఉండదని, టూ టౌన్‌లోని సవిత్యపేట, మార్కెట్ ఏరియా, కొత్తగూడెం, నవ్వారుపేట, బైపాస్ రోడ్డు, స్థానిక తణుకు రోడ్డులలో విద్యుత్ ఉండదని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాధవరం విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు విద్యుత్ ఈఈ కే.నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఐపీపీబీ ఖాతాలకు ఆధార్ సీడింగ్ తప్పనిసరి

భీమవరం: లబ్ధిదారులు సంక్షేమ పథకాల నగదు బదిలీకి బ్యాంక్ అకౌంట్–ఆధార్ అనుసంధానం తప్పనిసరిగా చేయించుకోవాలని భీమవరం పోస్టల్ డివిజన్ సీనియర్ సూపరిండెంట్ కె.హరికృష్ణ ప్రసాద్ కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

గడపగడపకు సేవలకు చెల్లు

- కార్యాలయాల చుట్టూ తిరగలేక ఇబ్బందులు పడుతున్న ప్రజానీకం
- సచివాలయాలు, రెవెన్యూ, మునిసిపాలిటీలకు తిరగడమే
- గుమ్మంలోకి వచ్చే వలంటీర్లు, రేషన్ బండి సేవలు ఆపేశారు
- కూటమి ఏడాది పాలనకు దండగంటున్న ప్రజలు



అత్తిలిలో రైతు సేవా కేంద్రం

తణుకు అర్బన్: పింఛను దరఖాస్తు చేసుకోవాలని ఒక వితంతువు, విద్యాసంవత్సరంలోకి అడుగుపెట్టేందుకు అవసరమైన ధ్రువపత్రాలకు విద్యార్థులు, రేషన్ కార్డు దరఖాస్తు చేసుకునేందుకు నవ దంపతులు, వికలాంగ పింఛను పొందేందుకు దివ్యాంగులు ఇలా అందరూ సచివాలయాలు, రెవెన్యూ, మునిసిపల్ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన రోజులు వచ్చాయి. తీరా వెళ్లాక రేపు రావాలంటూ చెబుతున్న అధికారుల సూచనలతో రోజుల తరబడి ఆయా కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ప్రజానీకం నానా అవస్థలు పడుతున్నారు. దీంతో జగన్‌బాబు ఉన్నప్పుడు అన్ని సౌకర్యాలు గడపలోకే వచ్చేవని జగన్ ఉన్నప్పుడే బాగుండేదంటూ ప్రజలు అభిప్రాయపడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ ఏడాది కాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మాకు బాగా బుద్ధి వచ్చిందంటూ బాహాటంగానే విమర్శిస్తున్నారు. తెల్లవారుజామున 5 గంటలకే పింఛను ఇంటి గుమ్మంలోకి తీసుకువచ్చిన వలంటరుకు ఏ సమస్య చెప్పుకున్నా కాగితాలు తీసుకువెళ్లి పనిపూర్తి చేసుకువచ్చే రోజులు పోయి నేడు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన రోజులు వచ్చాయంటూ ప్రజానీకం దుమ్మెత్తిపోస్తున్నారు.

50 ఇళ్లకో వలంటీరు..

నియోజకవర్గంలోని తణుకు మునిసిపాలిటీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల్లో ఉన్న 82 సచివాలయాల ద్వారా 50 ఇళ్లకో వలంటీరు రూపంలో ప్రజలకు అవసరమైన ప్రతి సేవను గడపలోకే తీసుకువచ్చి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందజేసిన విషయాన్ని నేడు ప్రజలు నెమరివేసుకుంటున్నారు. ఇంటి గుమ్మంలోకి వైద్యులు వచ్చేవారని, ఇంటి గుమ్మంలోకి రేషన్ బండి వచ్చేదని, ఏ సేవ కావాలన్నా అధికారులు సైతం జవాబుదారీతనంగా పనిచేసే పరిస్థితులు గత ప్రభుత్వ హయాంలో ఉండేదని కానీ నేడు సామాన్య ప్రజానీకానికి ఏ పని కావాలన్నా ఆ కాగితాలు ఏంటో తెలియడంలేదని ఒకవేళ కాగితాలు తీసుకువెళ్లినా రేపని మాపని ప్రాణాలు తోడేస్తున్నారంటూ ప్రజానీకం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఏ సేవ పొందాలన్నా ఆ అధికారే ఇంటి గుమ్మంలోకి వచ్చి పరిష్కరించే రోజులు పోయి బతికుండగానే చావును చూపించే ప్రభుత్వాన్ని తెచ్చుకున్నామంటూ ప్రజానీకం రోదిస్తున్న దుస్థితి నెలకొంది.

ఇంటి గడపలోకే వచ్చేవి..



ప్రభుత్వం నుంచి ఏ కాగితం కావాలన్నా, ఏ సంక్షేమ పథకం పొందాలన్నా, విద్యార్థులు ఏ ధ్రువపత్రం అవసరమైనా ఇంటి గడపలోకి వచ్చే పరిస్థితి గత ప్రభుత్వ హయాంలో ఉండేది. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఏ పని కావాలన్నా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడింది. గడపగడపకు పాలన ఎంతో పారదర్శకంగా అందే స్థితి నుంచి కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగే రోజులు వచ్చాయి. – బుంగ పద్మారావు, కేపీస్ గట్టు

కనుమరుగైపోయిన వలంటీర్ల వ్యవస్థ



పింఛన్లను అందజేస్తున్న దృశ్యం(ఫైల్)

తాడేపల్లిగూడెం: ఒకటోతేదీ ఉదయం ఐదు గంటలు కాగానే ఠంచన్‌గా పింఛన్ పండుటాకులకు, దీర్ఘకాల వ్యాధి గ్రస్తులకు, ఫిజికల్లీ చాలెంజ్‌డ్ వ్యక్తులకు, ఒంటరి మహిళలకు, వితంతువులకు అందేది.వలంటీర్లు ఇదే ప్రథమ కర్తవ్యంగా ఇంటి ముంగిటకు వచ్చి పింఛన్ అందచేసేవారు. అర్హులైన వారు ఆరోగ్యపరమైన ఇబ్బందితో దూర ప్రాంతాల్లో ఆసుపత్రులలో ఉన్నా, అక్కడికి వ్యయప్రయాసలకోర్చి వెళ్లి పింఛన్ అందచేసి వచ్చేవారు. చౌకధరల వస్తువుల పంపిణీ దుకాణం (రేషన్ షాపు)లకు వెళ్లాలంటే చాంతాడంత క్యూలు. తీరా దగ్గరికి వెళ్లే సరికి బియ్యం అయ్యిపోయాయి. రెండు రోజుల్లో రండనే అలసత్వ సమాధానాలు వినిపించేవి. సరుకు నల్లబజారుకు చేరేది. ఈ వ్యవస్థకు మంగళం పాడటానికి ఇంటింటికి రేషన్ పథకాన్ని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడం, లబ్ధిదారుల సమస్యలు తీర్చాలన్న సంకల్పంతో ఇంటింటికి రేషన్ వాహనాలను తీసుకొచ్చింది. సుమారు .71 లక్షల రూపాయల విలువైన వాహనాన్ని, లబ్ధిదారులు కేవలం పదిశాతం వాటా చెల్లిస్తే , వాహనాన్ని బ్యాంక్ ఆఫ్ దరోడా ద్వారా ఇప్పించింది. వాహన నిర్వాహకుడికి 21వేల వేతనం ఇచ్చింది. బ్యాంకు చెల్లింపులకు గాను నెలసరివాయిదా నిమిత్తం ప్రభుత్వమే 5800 రూపాయలు చెల్లించింది. మూడువేల రూపాయలు మాత్రం లబ్ధిదారులు బ్యాంకులకు చెల్లించేవారు. వేలాది మంది యువతకు ఇది ఉపాధిగా వచ్చి, కుటుంబాలు గడిచాయి. వైద్యం అల్పాదాయ వర్గాలకు కరువు. బరువు అనే పరిస్థితుల్లో ఫ్యామిలీ డాక్టర్ అందరిని ఆయుష్ మంతులను చేసింది.

గతమెంతో ఘనకీర్తి

వైఎస్సార్ పెన్షన్ కానుక పేరుతో 63,061 మందికి అందించారు. ఇప్పుడు పింఛన్‌కు కత్తెరలు, టెన్షన్‌లు. వలంటీర్ల వ్యవస్థకు మంగళం పాడారు. ఇంటింటికి రేషన్ వాహనాల సేవలు జూన్ ఒకటి నుంచి కనుమరుగుకానున్నాయి. ఫ్యామిలీ డాక్టర్ లేరు. వైద్యం అరకొరగానే ఉంది. ఇంటింటికి సేవ, అదే గత ప్రభుత్వ తోవ అంటూ గత కాలపు జ్ఞాపకాలను ప్రజలు నెమరవేసుకుంటున్నారు.

రెండు పూటలా రేషన్ దుకాణాలు తెరిచే ఉంచాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్

తాడేపల్లిగూడెం రూరల్: రేషన్ డీలర్లు ఉదయం, సాయంత్రం రెండు పూటలా రేషన్ దుకాణాలు తెరిచే ఉంచాలని తహసీల్దార్ ఎం.సునీల్ కుమార్ సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సునీల్ కుమార్ మాట్లాడుతూ రేషన్ పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. కార్డుదారులకు దూరంగా ఉన్న డిపోలను వారికి సమీపంలో ఏర్పాటు చేయాలన్నారు. సీఎస్ డీటీ అన్నపూర్ణ, సీనియర్ అసిస్టెంట్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అహల్యాబాయి హోల్కర్‌కు నివాళి

అత్తిలి: మండలంలోని శివారు బొంతు వారిపాలెంలో తూర్పు వీధి రామాలయం వద్ద బీజేపీ ఆధ్వర్యంలో పుణ్యశ్లోక అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు మామిడి శెట్టి నాగబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ, కావ్యరెడ్డి, బాలం మహేష్ , కొత్తపల్లి రామరాజు , తోట త్రిమూర్తులు, బండి సోమేంద్ర, మహిళలు పాల్గొన్నారు.

రైతులకు మద్దతు ధర పెంచాలి

పాలకొల్లు సెంట్రల్: ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతులకు విత్తనం, ఎరువులు, పురుగుమందులు ధరల పెరుగుదలతో గిట్టుబాటు కాక అనేక కష్టాలను చవిచూస్తున్నారని పాలకొల్లు మండల జెడ్పీటీసి నడపన గోవిందరాజులు నాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం ధాన్యం మద్దతు ధరపై ఆయన విలేకరులతో మాట్లాడుతూ వరి రైతులకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలకు రూ. 69 పెంపుతో ఎలాంటి ఉపయోగం లేదన్నారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు



శిక్షణ శిబిరంలో యోగా చేస్తున్న విద్యార్థులు



అత్తిలి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులచే పుస్తక పఠనం చేయిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో గ్రేడ్ -1 శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం అలరిస్తుంది. విజ్ఞాన తరగతులలో భాగంగా రిసోర్స్‌పర్సన్లు ప్రత్తి వీరాస్వామిచే విద్యార్థులు మంచి నడవడిక నేర్చుకోవాలన్నారు. చక్కని చదువులతో పాటు తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలన్నారు. కోపల్లె శ్రీనివాస్‌చే వర్షాకాలం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎం.పుష్పలతచే యోగా చేయించారు. జి.బాపయ్యశర్మచే సైన్సు పాఠ్యాంశాలు చెప్పించారు. గంథాలయ అధికారి వి.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. గ్రంథాలయాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్‌పై శిక్షణ

అత్తిలి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా అత్తిలి శాఖా గ్రంథాలయంలో గురువారం టీచర్ జి రవి శంకర్ విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్, స్పోకెన్ ఇంగ్లీషు వంటి పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు నీతి కథలు చెప్పి, పుస్తక పఠనం కలిగే ప్రయోజనాలను ఎస్ దుర్గా ప్రసాద్ వివరించారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయానికి వచ్చి విజ్ఞానాన్ని సముపార్జించాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డి కృష్ణారావు, పి వెంకటేశ్వరరావు, వై దుర్గా ప్రసాద్, వి లక్ష్మణరావు, యశస్విని, జి లలిత పాల్గొన్నారు.

కీటక జనిత ప్రదేశాలను నిలువరించాలి



స్థానికులకు ఆరోగ్య అవగాహన కరపత్రాలు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): సమష్టి కృషితో కీటక జనిత ప్రదేశాలను నిలువరించి దోమల వ్యాప్తిని అరికడదామని సబ్ యూనిట్ అధికారి వై.వీ.లక్ష్మణరావు అన్నారు. ఆరోగ్య అవగాహన కార్యక్రమాలలో భాగంగా పట్టణ ఆరోగ్య కేంద్రం యాగర్లపల్లి పరిధిలో 18వ వార్డులో గురువారం వెక్టార్ కంట్రోల్ హైజీన్, పరిసరాల పరిశుభ్రత, క్షేత్ర స్థాయి పరిశీలనలు, ర్యాలీలు జరిగాయి. కరపత్రాలను పంచారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత అన్నారు. దోమలు వృద్ధి చెందకుండా లార్వా జనిత ప్రదేశాలను గుర్తించి వాటిని నిర్వీర్యం చేయాలన్నారు. దోమకాటు ద్వారా వచ్చే వ్యాధులు మలేరియా, మెదడువాపు, చికెన్ గునియా, బోదకాలు వంటి వ్యాధులను నివారించేందుకు తప్పక దోమ తెరలను వాడాలన్నారు. పరిసరాలు పొడిగా ఉంటే దోమ పుట్టదని, తడి ప్రదేశాలను నిలువరించాలని పలు సూచనలు చేశారు. ఇంటి పరిసరాలలో తొట్లు, బానలు, డ్రమ్ములను శుభ్రపరిచి లార్వా దశలోనే నాశం చేయాలని చెప్పారు. ప్రజలందరూ ఆరోగ్య నియమాలను పాటించాలని తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించడం ద్వారా దోమ లార్వాలను నిలువరించవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఝాన్సీ, లక్ష్మీబాయ్, దుర్గ, ఆరోగ్య సహాయకులు కాంతారావు, ఆశా క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

కాకిలేరులో వికసిత్ సంకల్ప అభియాన్



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు

ఇరగవరం: రైతులు అధిక మొత్తంలో ఎరువులు, పురుగు మందులు వాడవద్దని జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం ఇరగవరం మండలం కాకిలేరు గ్రామంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖరీఫ్ సాగు సన్నద్ధత గురించి రైతులకు వివరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రైతులకు శిక్షణ, అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీటీఆర్ఐ జెఎంఎల్ డాక్టర్ సుబ్బయ్య, ప్రిన్సిపల్ శాస్త్రవేత్త ఆర్ఎఆర్ఎస్ మార్టేరు, ఎడిఆర్ అంచార్జీ డాక్టర్ సహదేవ రెడ్డి , కెవికె ఎన్ మల్లిఖార్జున్, డిఎఏటీసీ సెంట్రల్ శాస్త్రవేత్త నాగేంద్ర బాబు, కెవికె హర్టికల్చర్ శాస్త్రవేత్త డా బిందు ప్రవీణ, మండల వ్యవసాయ అధికారి వై రాఘవేంద్రరావు, విఏఏ బిందు, గ్రామ సర్పంచ్, నాయకలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గోగులమ్మకు వెండి కిరీటం



విశేష అలంకరణలో గోగులమ్మ

తాడేపల్లిగూడెం: మండలంలోని కడకట్ల ఇలవేల్పు గోగులమ్మ జాతరలో భాగంగా అమ్మవారికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆసాదుల నృత్యాలు, సాంప్రదాయ వాయిద్యాల మధ్య తంతు వేడుకగా జరిగింది. అమ్మవారికి ప్రత్యేకంగా వెండి కిరీటాన్ని తయారు చేయించారు.

ఆర్థిక సాయం అందజేత



తణుకులో బాధిత కుటుంబసభ్యులకు చెక్కు అందజేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: సమాజంలో మానవత్వాన్ని పరిమళింపచేయాలనే ఉద్దేశ్యంతో మానవత సేవా సంస్థ ద్వారా సేవలు విస్తృతంగా అందజేస్తున్నామని ఆ సంస్థ అధ్యక్షురాలు కఠారి శారదాదేవి అన్నారు. తణుకు గమిని ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మానవత సంస్థ ద్వారా తణుకు పట్టణానికి చెందిన దాత చిట్టూరి సుజాత చేస్తున్న దాతృత్వం ఎనలేనిదని అన్నారు. తణుకుకు చెందిన ఎస్‌టీ మహాలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో ఉన్న పరిస్థితుల్లో ఆర్థికసాయంగా చిట్టూరి సుజాత సౌజన్యంతో రూ.10వేలు అందజేసినట్లు చెప్పారు. శాంతి ర్యాలీ కమిటీ చైర్మన్ గమిని రాంబాబు, మానవత సంస్థ ప్రతినిధులు బొల్లం రామకాశీ, కడించర్ల రాజరాజేశ్వరరావు, ఆలపాటి సుబ్బారావు, ఆలపాటి సోమేశ్వరరావు, అర్జి భాస్కరరావు, డాక్టర్ దాట్ల సత్యనారాయణరాజు (జనత డాక్టర్) పాల్గొన్నారు.

సరుకుల పంపిణీలో నిర్లక్ష్యం వద్దు

తణుకు అర్బన్: రేషన్ డిపోల వద్ద సరుకుల పంపిణీ సందర్భంగా కార్డుదారులకు ఎటువంటి అసౌకర్యం కలిగిన చర్యలు తప్పవని తహసీల్దార్ దండు అశోక్‌వర్మ తెలిపారు. తణుకు మండలంలోని 72 రేషన్ దుకాణాలు 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు దుకాణాలు తెరచి ఉంటాయని, రూరల్ ఏరియాలో ఉదయం 7నుంచి 11 గంటలు వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు, అర్బన్ ఏరియాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు తెరచి ఉంటాయని స్పష్టం చేశారు. లబ్ధిదారులు తమకు అనుకూలమైన సమయంలో రేషన్ సరుకులు పొందవచ్చని, దివ్యాంగులు, అనారోగ్యంతో మంచంపై ఉన్నవారికి సదరు డీలర్లు ఇంటికి రేషన్ పంపిణీ చేస్తారని చెప్పారు. రేషన్ దుకాణాల్లో బియ్యం ఉచితంగాను, పంచదార అంత్యోదయ కార్డు ఒక్కింటికి ఒక కిలో రూ.13.50 చొప్పున, మిగిలిన కార్డులకు ఒక్కింటికి అర కిలో రూ. 17 చొప్పున పంపిణీ చేస్తామని వివరించారు.

అప్పారావుకు సేవలు మరువలేనివి



తూర్పు విప్పర్రు గ్రామంలో అప్పారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఇరగవరం: మండలంలోని తూర్పు విప్పర్రు గ్రామంలో గురువారం సీపీఐ భవనంలో కామ్రేడ్ సంకు అప్పారావు 33వ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రిటైర్ లెక్చరర్, సామాజిక వేత్త సంకు మనోరమ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధునిగా, రైతు నాయకునిగా కామ్రేడ్ అప్పారావు అనేక సేవలు చేశారన్నారు. కమ్యూనిస్ట్ నాయకునిగా అనేక పోరాటల్లో పాల్గొని పార్టీకి ప్రజలకు అనేక సేవలు అందజేశారన్నారు. ఈ కార్యక్రమం మండల సీపీఐ మండల కార్యదర్శి నామాన వెంకటేశ్వరరావు, గ్రామ కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ, ప్రజా నాట్య మండలి కళాకారులు గిద్దా సూర్యనారాయణ, కుడిపూడి వెంకట రెడ్డి, కాటూరి రాముడు, చిక్కలా బ్రహ్మాజీ, గుడిమెట్ల కోటేశ్వరరావు, బొరుసు యేసు, తిరుమల శెట్టి చంటి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల కోసం రూ. 3.95 కోట్లు

తాడేపల్లిగూడెం: జూన్ నెల పింఛన్‌ల కోసం పట్టణంలో 35 వార్డులకు రూ.3.95 కోట్లను పంపిణీ చేయనున్నట్టు మునిసిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు తెలిపారు. 8,956 మంది లబ్ధిదారులకు 35 వార్డులలో పనిచేస్తున్న 224 మంది సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి పింఛన్ అందజేస్తారన్నారు. లబ్ధిదారులు ఎవ్వరూ ఎక్కడకు రానక్కరలేదన్నారు.

మంచినీటి కాలుష్యంపై ఆందోళన



మంచినీటి కాలుష్యంపై నిరసన వ్యక్తంచేస్తున్న సీపీఎం నాయకులు, మహిళలు

ఆకివీడు: కుళాయిల ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతుందని స్థానిక 13వ వార్డులోని శ్రీనగర్‌కాలనీ వాసులు గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. కుళాయి నీరు పట్టుకున్న తరువాత ఆ నీటిని పరిశీలిస్తే దుర్వాసన వస్తుందని, పసర్ల రంగుతో నీరుందని సీపీఎం నాయకుడు పెంకి అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. నగర పంచాయతీ అధికారులు ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. ఇంటి అవసరాలకు, ఇతర అవసరాలకు కూడా ఉపయోగించలేనంత దారుణంగా నీరు ఉందని పేర్కొన్నారు. ఈ నీటితో స్నానాలు చేయడం వల్ల దురదలు వస్తున్నాయని మహిళలు ఆవేదన చెందుతున్నట్లు తెలిపారు. దీనిపై తక్షణం చర్యలు తీసుకోవాలని నగర పంచాయతీ అధికారులకు విజ్ఞప్తిచేశారు. అధికారులు స్పందించకపోతే నగర పంచాయతీని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మహిళలు ఎస్కే అమ్మాజీ, సుబ్బలక్ష్మి, దొడ్డి పద్మ, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఓబికి నిధులివ్వండి

తాడేపల్లిగూడెం: నియోజకవర్గంలో మూడవ ఫ్లైవోవర్ వంతెన నిర్మాణంలో భాగంగా ఎల్‌సీ నంబర్ 374 రైల్వే క్రాసింగ్‌పై ఆర్ఓబి కోసం నిధులు ఇవ్వాలని ప్రభుత్వ విప్ , ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు గురువారం సికింద్రాబాద్‌లోని దక్షిణమధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌ను కోరారు. గూడెం రైల్వే స్టేషన్ అభివృద్ధి నిమిత్తం ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంటు ఫండ్ కింద నిధులు మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గంలోని ఐదు రైల్వే క్రాసింగ్స్, ఒక అండర్ పాస్ నిమిత్తం నిధులు ఇవ్వాలని కోరారు. డీజీఎం మల్లాది శ్రీనివాసు, అధికారి ఉదయకాంత్‌ని కలిశారు. ఆయనతో పాటు జడ్ ఆర్ సీసీ సభ్యుడు రవి అగర్వాల్ ఉన్నారు.